కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజనులు

గిరిజనులపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో

రామారెడ్డి, నవంబర్ 19: లగచర్లలో గిరిజనులు, మహిళలపై దాడి, అరెస్టును నిరసిస్తూ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో గిరిజనులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఎం కుటుంబసభ్యుల ఫార్మా కంపెనీ కోసం ప్రభుత్వం గిరిజన, గిరిజనేతరులకు జీవనాధారమైన భూములను లాక్కోవడం సమంజసమా? అని ప్రశ్నించారు. భూమి ఇవ్వకపోతే గిరిజనులను కొడతారా? మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తారా? అని మండిపడ్డారు. గిరిజనులను అక్రమంగా అరెస్టు చేసి ప్రభుత్వం భూములను గుంజుకోవాలని చూస్తున్నదని దుయ్యబట్టారు. దళిత, గిరిజనుల భూములను లాక్కుని తన కుటుంబసభ్యులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లు సంపాదించేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

రేపు మానుకోటలో మహా ధర్నా

- హాజరుకానున్న కేటీఆర్
- గిరిజనుల సమస్యలపైనే పోరాటం
- ఎమ్మార్వో సెంటర్‌లో స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 19: లగచర్ల ఘటన, గిరిజన రైతుల సమస్యలు, ఎన్నికల హామీలు అమలు చేయాలని ఈ నెల 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహా ధర్నా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. మంగళవారం రవీందర్‌రావు బీఆర్ఎస్ నాయకుతో కలిసి పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో మహాధర్నా కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అధికారం ఉంది కదా అని రేవంత్‌రెడ్డి లగచర్ల రైతులపై పోలీసులతో దాడులు చేయించి జైలుకు పంపించారని విమర్శించారు. లగచర్ల గిరిజన రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నదదని చెప్పారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. మానుకోట జిల్లాలో అధిక సంఖ్యలో గిరిజన రైతులున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా నిర్వహిస్తున్నామని స్పష్టంచేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో గిరిజన రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు.

నిజనిర్ధారణపైనా నిర్బంధం

మొదటిపేజీ తరువాయి...

చేశారు. లగచర్ల వెళ్లకుండా పోలీసులు తమను అడ్డుకోవడంపై సంధ్య మండిపడ్డారు. పరిగిలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడారు. బాధితుల వద్దకు వెళ్తే నిజాలు బయటపడతాయన్న భయంతోనే ప్రభుత్వం, పోలీసులు తమను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తమను లైంగికంగా వేధించారని, అసభ్య పదజాలంతో దూషించారని, తమకు అండగా నిలవాలని కోరుతూ బాధితులు ఫోన్లు చేసి కోరుతున్నారని తెలిపారు. గిరిజన మహిళలపై దౌర్జన్యాలు చేయకుంటే, లైంగిక వేధింపులకు పాల్పడకుంటే తమను ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే అనుమానంగానే ఉందన్నారు. లగచర్ల ఘటనపై ప్రతి ఒక్కరు స్పందించాలని పిలుపునిచ్చారు. వారికి తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.

పోలీసుల తీరుతో ఆరోపణలకు బలం

లగచర్ల ఘటనకు సంబంధించి ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు వెళ్తుండగా పోలీసులు తమను అడ్డుకోవడం దారుణమని సంధ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిందని ఆరోపించారు. తమను నిర్బంధించి, బూతులు మాట్లాడారంటూ బాధితులు చెప్తున్నది నిజమో, కాదో తెలుసుకునేందుకు వచ్చామని, పోలీసుల తీరు చూస్తుంటే వారి ఆరోపణ నమ్మే విధంగానే ఉన్నదని తెలిపారు. పోలీసులు తన దుస్తులు చింపివేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నిర్బంధ పాలన, జులుం, ప్రజల హక్కులను గౌరవించని తనం, ప్రజా వ్యతిరేక పాలన, కార్పొరేట్ అనుకూల పాలన సాగుతోందని విమర్శించారు. మూసీ ప్రజల ఆక్రందనలు, ఆందోళనలు పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. భూములు ఇచ్చేది లేదని చెప్పే హక్కు రైతులకు లేదా? అని ప్రశ్నించారు. ప్రజల ఆక్రందన, ఆవేదనను అర్థం చేసుకునేందుకు వచ్చిన తమపైనా ప్రభుత్వం నిర్బంధం, నియంతృత్వం ప్రదర్శించిందని విమర్శించారు.

7వ గ్యారెంటీగా నిర్బంధ పాలన

ఫార్మాసిటీలు, ఇథనాల్ ఫ్యాక్టరీల దగ్గర ప్రజలు ఎవరూ సంతోషంగా లేరని సంధ్య పేర్కొన్నారు. ప్రజల గోడు పట్టించుకోకుండా, ప్రజలను భాగస్వామ్యం చేయకుండా చేసేది అభివృద్ధి కాదని విమర్శించారు. కాంగ్రెస్ గెలిచినప్పుడు అక్కడ డీజేలు పెట్టి సంబురాలు జరుపుకొన్నారని, అలాంటి వారిపై పోలీసులు ప్రయోగిస్తున్న భాష, ప్రభుత్వ వైఖరి సరిగా లేదని పేర్కొన్నారు. ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం అని చెప్పిన రేవంత్‌రెడ్డి పాలనతో నిర్బంధం కొనసాగుతున్నదని విమర్శించారు. ఈ ప్రాంత రైతులు పోలేపల్లి సెజ్‌ను సందర్శించారని, అప్పుడు వారు చెప్పింది విని రైతులు షాకయ్యారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీలు ఏమూలకు రావని, కాలుష్యంతో అనారోగ్యాల బారినపడుతున్నాని, పిల్లలు అష్టవంకర్లతో పుడుతున్నారని, భూములు ఇచ్చి తప్పు చేశామని, మీరు కూడా భూములిచ్చి తప్పు చేయవద్దని వారితో చెప్పారని తెలిపారు. పోలీసులు తమ ఇండ్లకు వచ్చి తలుపులు పగలగొట్టి అసభ్యంగా వ్యవహరించి తమ కొడుకులు, భర్తలను అరెస్ట్ చేశారని లగచర్ల మహిళలు వాపోతున్నారని సంధ్య పేర్కొన్నారు.

భూమి ఉన్న చోటే కంపెనీ పెట్టుకోండి

సిస్టర్ లిల్లీ మాట్లాడుతూ మహిళలపై అన్యాయాలు, దాడులు జరిగినపుడు పౌరులుగా స్పందించడం తప్పా? అని ప్రశ్నించారు. ప్రజల జీవితాలను తొక్కేసి ఇతరుల అభివృద్ధికి కృషి చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. అక్కడి వారు కష్టంగా జీవిస్తూ, కష్టపడి ఇండ్లు కట్టుకుని, పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని, అది వారు ఆ ప్రాంతానికి తీసుకొచ్చిన అభివృద్ధి అని పేర్కొన్నారు. భూమి ఉన్న చోటే కంపెనీలు పెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వం ప్రజల మాట వినాలని, వారి కష్టాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజల భూమి హక్కులపై ప్రభుత్వం దాడి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల జేఏసీ నాయకురాళ్లు పద్మజాషా, ఝాన్సీ, అనసూయ, సజయ, గీత తదితరులు పాల్గొన్నారు.

పరిగిలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న సంధ్య

సీఎం ఇలాకాలో ఇంత నిర్బంధమా?

లగచర్ల వెళ్లిన మహిళానేతలపై దౌర్జన్యమా? ● కొడంగల్ పాకిస్థాన్ బార్డర్‌లో ఉన్నదా?

లగచర్ల చైనా సరిహద్దుల్లోని కల్లోలితా ప్రాంతమా? ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో ఇంత నిర్బంధమెందుకు? కొడంగల్ ఏమైనా పాకిస్థాన్ బార్డర్‌లో ఉన్నదా? లగచర్ల చైనా సరిహద్దుల్లో ఉన్న కల్లోలితా ప్రాంతమా?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'లగచర్లలో అర్ధరాత్రి గిరిజన బిడ్డలపై దమనకాండే కాదు..నిజనిర్ధారణ కోసం పట్టపగలు అక్కడికి వెళ్లిన మహిళా సంఘాల నేతలను పోలీసులు అడ్డుకొని దౌర్జన్యం చేయడం అమానుషం' అని మంగళవారం ఎక్స్ వేదికగా ఖండించారు. వాస్తవాలు తొక్కిపెట్టేందుకు ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తున్నదని నిలదీశారు. పదేండ్లలో ఎన్నడూలేనివిధంగా కొడంగల్ ఏరియాలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, అక్కడికి వెళ్లే దారుల్లో పోలీసు పహారా ఏర్పాటుచేసి మూసేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ' రేవంత్‌రెడ్డీ.. మీరెంత దాచే ప్రయత్నం చేసిన నిజం దాగదు.. లగచర్లలో మీ సర్కారు కిరాతకం ఇప్పటికే ఢిల్లీకి చేరింది. దేశరాజధానిలో మీ అరాచక పర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతున్నది' అంటూ దుయ్యబట్టారు. నిజనిర్ధారణ కమిటీలను అడ్డుకోవడమంటే తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టేనని పేర్కొన్నారు. అడ్డుకున్నందుకు మహిళా సంఘాలకు క్షమాపణ చెప్పి, లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తేసి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

లోకం పోకడ

లగచెర్ల ఘటనలో సురేశ్‌కు సంకెళ్లు వేసి కొడంగల్‌లో వైద్యపరీక్షలకు తీసుకెళుతున్న పోలీసులు

లగచర్ల సురేశ్ లొంగుబాటు

14 రోజుల రిమాండ్, సంగారెడ్డి జైలుకు తరలింపు

కొడంగల్, నవంబరు 19: లగచర్ల సంఘటనలో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న బోగమోని సురేశ్ మంగళవారం కొడంగల్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట లొంగిపోయాడు. వారం రోజులుగా సురేశ్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు నాలుగు బృందాలుగా పలు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించారు. మంగళవారం సురేశ్ స్వయంగా కొడంగల్ కోర్టుకు హాజరై లొంగిపోయాడు. సురేశ్‌కు స్థానిక ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించి, 14 రోజుల పాటు సంగారెడ్డి జైలుకు రిమాండ్‌కు తరలించారు. 'ప్రశ్నించే గొంతుకు సంకెళ్లు వేస్తే.. మూగబోవు', 'రాకెట్ వేగంతో పోరాటం చేస్తా..'అని నినాదాలు చేస్తూ పోలీసు వాహనంలో జైలుకు వెళ్లాడు. ఏ-38 హన్మంతు, ఏ-55 నీరటి సురేశ్‌లను బొంరాస్‌పేట పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచగా 14 రోజుల రిమాండ్ విధించింది.

ఢిల్లీలోనే లగచర్ల బాధితులు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఢిల్లీకి వెళ్లి ఎస్‌హెచ్‌ఆర్సీ, మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన లగచర్ల బాధితులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. మంగళవారం ఉదయం లగచర్ల బాధితుల కోసం బీఆర్ఎస్ నాయకులు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని రాష్ట్రపతికి విన్నవించారు. స్పందించిన రాష్ట్రపతి కార్యాయాల అధికారులు లగచర్ల ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాలని అడిగారు. లగచర్లలో గిరిజన కుటుంబాలపై జరిగిన దాడులు, పోలీసుల అక్రమ అరెస్ట్‌లు, ఫార్మాసిటీ కోసం బలవంతపు భూ సేకరణ వివరాలను అందజేశారు. మంగళవారం రాత్రివరకు కూడా వారికి అపాయింట్‌మెంట్ లభించలేదు.

'ఫార్మా'కు అనుమతి ఇవ్వొద్దు

సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): వికారాబాద్ జిల్లాలోని లగచర్లకు వెళ్లకుండా పోలీసులు మహిళా సంఘాల నేతల్ని టుంకిమెట్ల వద్ద అడ్డుకోవడం అప్రజాస్వామికమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కే గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. లగచర్ల ఘటనలో వాస్తవాలను తెలుసుకునేందుకు వెళ్తున్న మహిళా సంఘాల నేతలు ప్రొఫెసర్ పద్మజాషా, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వీ సంధ్య, ఝాన్సీ, సజయ, అనసూయ, జ్యోతి, శ్రీదేవి, గీతను పోలీసులు అడ్డగించడం చట్టవిరుద్ధమని తెలిపారు. వారిని బలవంతంగా హైదరాబాద్‌కు తరలించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని చెప్పారు. లగచర్లలో ఫార్మా కంపెనీకి అనుమతి ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీని వ్యతిరేకించే వారిని అరెస్ట్ చేస్తూ నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడి నిందితులకు

బెయిల్ ఇవ్వొద్దు

జాతీయ ఎస్సీ కమిషన్‌కు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీలపై దాడి చేసిన నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా జాతీయ ఎస్సీ కమిషన్ చొరవ చూపాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వాన్‌కు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వాన్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హన్సర్‌సింగ్ ఆర్యాలతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు జిల్లా శంకర్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రాంబాబునాయక్, నీలాదేవి సమావేశమయ్యారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపకుండా స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో బాధితులు, సాక్షులతో నిందితులు కేసులు రాజీ చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిపారు. దీంతో చట్టం స్ఫూర్తి నీరుగారి బాధితులకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు. స్పందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ మక్వాన్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రధాని, కేంద్ర సామాజిక న్యాయమంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అంతేకాకుండా సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్టు గుర్తుచేశారు.

ఎల్‌వోసీ కన్నా ఘోరంగా లగచర్ల

- గిరిజనులు దేశద్రోహులా?
- సీఎం లగచర్లకు పోడెందుకు?
- రాష్ట్రపతికీ ఫిర్యాదు చేస్తాం
- ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

ఢిల్లీలో గిరిజన నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

అవకాశం ఉంటే రాష్ట్రపతికి నివేదిస్తాం

రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న దాడులను దేశం దృష్టికి తీసుకెళ్లి తద్వారా వారికి న్యాయం జరిగేందుకు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న కృషిలో భాగంగా లగచర్ల బాధితుల వెంట తాము ఢిల్లీలో ఉన్నామని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్ సానుకూలంగా స్పందించాయని తెలిపారు. లగచర్ల ఘటనపై డీజీపీ, సీఎస్‌కు ఆదేశాలిస్తామని, బాధితులు ధైర్యంగా ఉండాలని ఆయా వేదికల పెద్దలు అభయం ఇచ్చారని తెలిపారు. లగచర్ల దురాగతాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): లగచర్ల ఏమైనా నియంత్రణ రేఖనా (ఎల్‌వోసీ), అక్కడి గిరిజనులు దేశద్రోహులా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బందిపోట్లు, దేశద్రోహుల కన్నా ఘోరంగా లగచర్ల గిరిజనులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాడులకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలో గిరిజన నాయకులు రామచంద్రునాయక్, వాల్యానాయక్, రూప్‌సింగ్‌నాయక్, రాంలాల్‌నాయక్, లక్ష్మానాయక్, మోహన్‌నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజనులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లగచర్లలో జరిగిన దాడి మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు ఏమాత్రం తీసిపోదని పేర్కొన్నారు. ఫార్మా కోసం భూములివ్వబోమని గిరిజనులు చెప్పిన పాపానికి రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌పై దాడి జరగకున్నా జరిగినట్టు చిత్రీకరించి గిరిజనులపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ వంటి వాళ్లను సైతం వెళ్లనీయడం లేదంటే లగచర్లలో జరుగుతున్న దాడులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలని కోరారు. సీఎం సొంత నియోజకర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో గిరిజనులు, మహిళలు, పౌరులపై జరుగుతున్న దాడులు ఏ స్థాయిలో ఉన్నాయో జాతీయ సంస్థలు గుర్తించాలని కోరారు. పదేండ్లు తెలంగాణను సుభిక్షంగా, సుసంపన్నంగా తీర్చిదిద్దిన కేసీఆర్ విధానాలకు వ్యతిరేకంగా చేయడమే పాలనగా రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని చెప్పారు. కప్పం కట్టేందుకు రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లే సమయం ఉంటుంది కానీ, లగచర్ల వెళ్లడానికి లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొంతమంది గిరిజన ద్రోహులు లగచర్లలో అసలేం జరగలేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా గిరిజనులకు అండగా ఉండాలని కోరారు.

పట్నం నరేందర్‌రెడ్డికి ఊరట

ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలన్న హైకోర్టు ● ఇంటి భోజనం స్వీకరించేందుకూ అనుమతి

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మాజీ శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డికి కోర్టులో ఊరట లభించింది. ఆయనను ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని, ఇంటి నుంచి తీసుకొచ్చే భోజనాన్ని అందించాలని హైకోర్టు జైలు అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. జైలులో నరేందర్‌రెడ్డిని ఇతర నేరగాళ్లతో కలిపి ఉంచడాన్ని సవాలు చేస్తూ ఆయన భార్య శృతి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ జరిపారు. ఫార్మా సిటీ భూసేకరణపై రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేయడంతో అందుకు తన భర్తే కారణమంటూ అన్యాయంగా కేసు బనాయించారని శృతి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నరేందర్‌రెడ్డిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచేలా జైలు అధికారులను ఆదేశించాలని, ఇంటి నుంచి ఆహారాన్ని పంపేందుకు అనుమతించాలని కోరారు. ఆమె తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, న్యాయవాది సాముల రవీందర్ వాదనలు వినిపిస్తూ.. కొడంగల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేగా నరేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని, అందుకే అక్రమంగా కేసులో ఇరికించారని వివరించారు. లగచర్లలో గిరిజనుల భూములు లాక్కొని ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నరేందర్‌రెడ్డి గుండె, మూత్రపిండాలు, వెన్ను, పొత్తికడుపు సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. విచారణ ఖైదీగా ఉన్న ఆయనను జైలులో నేరగాళ్లతో కలిపి ఉంచితే ప్రాణహాని ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనను ప్రత్యేక బ్యారక్‌కు తరలించాలని, ఇంటి భోజనం స్వీకరించేందుకు అనుమతించాలని కోరారు. ఇదే విషయమై 15న రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాదనలను న్యాయమూర్తి ఆమోదించారు.

ఫార్మా కంపెనీ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి

- బలవంతంగా భూములు గుంజుకోవద్దు
- అరెస్ట్ చేసిన గిరిజన బిడ్డల్ని విడుదల చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులకు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ చౌరస్తా, నవంబర్ 19: లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్ట్ చేసిన లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులను మంగళవారం ఆయన జనగామ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కలిసి మద్దతు ప్రకటించారు. లగచర్ల చుట్టుపక్కల ఉన్న ఐదు తండాల్లోకి అర్ధరాత్రి పోలీసు బలగాలు ప్రవేశించి మహిళలని కూడా చూడకుండా వారిపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుషులను అరెస్ట్ చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి బలవంతంగా భూములు లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. లగచర్ల బాధితులకు మద్దతుగా నిలిచిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను రెండు రోజులుగా అర్ధరాత్రి స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన గిరిజన బిడ్డలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను అడుగుతారనే మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం ముందస్తుగా అరెస్ట్ చేసిందని విమర్శించారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామినాయక్, కౌన్సిలర్ అనిత, దయాకర్, కోఆప్షన్ మెంబర్ మసీఉర్ రెహమాన్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల ఘటనపై సీబీఐ విచారణ జరపాలి

- బీజేపీ, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం
- పొంగులేటి ఇంటిపై ఈడీ దాడి ఘటనలో ఈసీఐఆర్ ఎందుకు బయటపెట్టడం లేదు?
- రాహుల్‌గాంధీ వ్యతిరేకించే అదానికి సీఎం రేవంత్ ఎందుకు రెడ్‌కార్పెట్ వేస్తున్నరు?
- బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి నిలదీత

తెలంగాణభవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): బీజేపీ నేత, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి దమ్ముంటే లగచర్ల ఘటనపై సీబీఐ ఎంక్వయిరీ వేయించి నిజాలు నిగ్గు తేల్చాలని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ చెప్పుచేతల్లో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. సిద్ధాంతపరంగా వైరుధ్యం కలిగిన బీజేపీ, కాంగ్రెస్.. తెలంగాణలో కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకోవడానికి చాలా రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. వీటికి బీఆర్ఎస్, కేటీఆర్ టార్గెట్‌గా మారారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ కొట్టుకోవడం కాదు.. బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని గతంలో సంజయ్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇందుకు సంబంధించిన ఆడియోను మీడియాకు వినిపించారు. బీఆర్ఎస్ ఉంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదని కేసీఆర్‌ను టార్గెట్ చేశారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం జరిగిందని ఆరోపించారు. తెలంగాణభవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చిరుమిళ్ల రాకేశ్, మనోహర్‌రెడ్డి, చటారి దశరథ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డితో కలిసి బండి సంజయ్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో ఎంపీగా బండి సంజయ్ గెలవడానికి, బీజేపీ ఎనిమిది మంది ఎంపీలు రాష్ట్రం నుంచి గెలవడానికి రేవంత్‌రెడ్డి కారణమని బయట ఎవరి